# ఓ రచయిత భార్య

పెళ్ళిచూపులప్పుడు చెప్పారు రత్నమాలకి, పెళ్ళి కొడుకు కథలు వ్రాస్తూంటాడని. 'ఓహో' అనుకుందంతే. రత్నమాలకి సాహిత్యంలో అభిరుచి యే మాత్రం లేదు పుస్తకం పట్టుకుంటే కార్టూన్స్, సినిమా విశేషాలు చదివి పుస్తకాన్ని అవతల పడేస్తుందేతప్ప. పుస్తకంలో ఏం కథ లున్నాయి, ఏఏ రచయితలు వ్రాశారు, అనే విషయాలేవీ పట్టించుకోదు. అసలు యీ కాలపు సాహిత్య మెలాంటిదో ఆమెకు తెలియదు.

సూర్యారావు సెక్రటేరియట్‌లో పని చేస్తున్నాడని చెప్తే ఎలా మామూలుగా 'అలాగా' అనుకుందో. అదే విధంగా 'ఓహో' అనుకుంది అతను రచయిత అని తెలిసి నప్పుడుకూడా. ఈ విషయానికి పెద్దగా ప్రాముఖ్యత యివ్వ లేదు రత్నమాల.

దేవుడు వాళ్ళిద్దరికీ స్వర్గంలోనే పెళ్ళిచేసి వుండి వుంటాడు. అందుకని భూలోకంలో, రేపల్లెలోకూడా ఇద్దరి

వివాహం మళ్ళీ మరోసారి అయింది. ఇరుపక్షాల వారికీ సమ్మతం అవటంవల్ల పెళ్ళి జరిగిపోయింది.

తర్వాత రత్నమాల రేపల్లెనుంచి హైదరాబాద్ వచ్చింది చీరెసారెలతో. హిమాయత్ నగర్ లోని ఓ రెండు గదుల ఏస్‌బెస్టాస్ రేకుల ఇంట్లో వాళ్ళ కాపరం మొదలయింది.

రత్నమాల తనభర్త ఏవిధంగా తనతో ప్రవర్తించాలో తనతో ఎంతకాలం వెచ్చించాలో ముందరే స్థిరమయిన అభిప్రాయాలు ఏర్పరచుకుంది. కాని సూర్యారావుకి ఒక్క భార్యే వ్యాపకము కాదు. వేరే రెండు ముఖ్యమయిన వ్యసనాల్లాంటి వ్యాపకాలున్నాయి. అవి అతని పద్దెనిమిదోయేట నుంచి, అంటే ఆ రేళ్ళనుంచీ అతనికి అలవాటు. అకస్మాత్తుగా ఇప్పుడు భార్య ఇష్టప్రకారం ఆ అలవాట్లని మార్చుకోవటం దుస్సాధ్యమయిపోయింది అతనికి.

"ఇవాళ జీతం వచ్చిందిగా. మనిద్దరం కలిసివెళ్ళి షాపింగ్ చేసుకొద్దాం" అన్నది రత్నమాల కాపరానికి వచ్చిన తర్వాత మొదటి జీతం అందగానే.

"అలాగే" అన్నాడు సూర్యారావు హుషారుగా.

ఇద్దరూ రాత్రి బయటహోటల్లో భోజనం చేసి సరుకులు సూపర్ బజార్లో కొనుక్కొని రాత్రి పదింటికి ఇంటికి వచ్చారు.

"నిన్ననేగా జీతం వచ్చింది. సరదాగా సినిమాకి వెళ్దాం యివాళ" ప్రతిపాదించింది రత్నమాల మర్నాడు.

'అలాగే'

ఇద్దరూ హిందీ సినిమాకి వెళ్ళి రాత్రి ఓ స్నేహితుడింట్లో భోజనంచేసి పదిన్నరకి ఆటోలో యింటికి చేరుకున్నారు.

"ఇవాళ ఆదివారంగా. నెహ్రూ జులాజికల్ పార్క్‌కి వెళదాం. నే నెప్పుడూ చూడలేదు."

సూర్యారావు ఆదివారం పుదయం పదింటికి భార్యతో వెళితే రాత్రి పదిన్నరకి వచ్చాడు పూర్తిగా అలసిపోయి. చార్‌మినార్ ఎక్కడంతో యిద్దరూ అలసిపోయారు.

మొదటి రెండు నెలలు యిలా ఆదివారాలు, శెలవు రోజులు, ఆఫీస్ వున్న రోజుల్లో సాయంత్రాలు సూర్యారావుకి భార్యతో ఖర్చయిపోయాయి.

సూర్యారావుకి రెండు వ్యసనాలున్నాయి. అవి తాగుడు, పేకాట, జూదం లాంటివి కావవి.

ఒకటి రచనలు చేయటం, రెండోది పుస్తకాలు చదవటం, పెళ్ళికాకమునుపు రోజుకో నాలుగయిదు పేజీలు అయినా నలుపు చేసి, వారానికో లావుపాటి పుస్తకమైనా పూర్తి చేసేవాడు. ఆరేళ్ళుగా అలా అలవాటు పడ్డాక యిప్పుడు కథలు వ్రాయకుండా పుస్తకాలు చదవకుండా తన తీరిక సమయాలని భార్యతో గడపటానికి మనస్కరించటం లేదు సూర్యారావుకి, అందులో మాధుర్యం వున్నా.

కొత్తపుస్తకాలు చదవాలి తనకి వచ్చే వూహల్లోంచి, కలిగే అనుభవాలని జోడించి కొత్తకొత్త కథలు వ్రాయాలి అన్న తపన రోజురోజుకీ ఎక్కువవుతూనే వుంది. కాని అందుకు కాలం కావాలి.

రత్నమాల కాపరానికి వచ్చిన మూడునెలల తర్వాత క్రమంగా సూర్యారావు భార్యతోనే తన సమయము అంతా వెచ్చించడం తగ్గించేశాడు. మళ్ళీ తన పాత ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు. తోటి రచయితలింటికి సాహిత్య చర్చల కోసం వెళ్ళటం లేదా యింట్లోనే వుంటే కథలు వ్రాసుకోవడం.

“సినిమాకి వెళదాం రండి” అని రత్నమాల కోరితే “నవల వ్రాస్తున్నాను. ఇది పూర్తయ్యేదాకా నిద్రపట్టదు. ఆలోచనలన్నీ దానిమీదే వుంటాయ్. నువ్వు ఒక్కదానివే ఆటోలో వెళ్ళి రా” అంటాడు రైటింగ్ టేబిల్ ముందునుంచి కదలకుండానే.

క్రమంగా సూర్యారావు ప్రవర్తనలో వచ్చినమార్పు రత్నమాలని బాధించసాగింది.

“ఎప్పుడుచూసినా మీరు మీ కథలూ, పుస్తకాలూ వుత్తరాలతో కాలక్షేపం చేయటం తప్ప యింకేం పట్టించుకోరే!” కోపంగా నిలదీసింది రత్నమాల ఒకరోజు.

సూర్యారావు చిద్విలాసంగా నవ్వి వూరుకున్నాడు.

“సమాధానం చెప్పరే! అసలింట్లో ఇంకో మనిషి

వున్నదన్నట్లుగా ప్రవర్తించరే! నేను కేవలం వంటచేసిపెట్టే పనిమనిషిలా కనిపిస్తున్నానా ?"

"ప్లీజ్. కాసేపు గొడవచెయ్యకు" అన్నాడు సూర్యారావు.

"నేను మాట్లాడితే గొడవా ? చూస్తూంటే మీరు ఎన్ని జన్మలయినా ఆ కలాలతో కాగితాలమధ్య గడిపే ట్లున్నారు. ఇవతల యింట్లో మనిషి వున్నదన్న సంగతే మీరు పట్టకపోతే ఎలా ?"

సూర్యారావు కొద్దిగా విసుగ్గా అన్నాడు.

"మూడ్ పోతుంది. కాసేపు అల్లరి చెయ్యకు. కావాలంటే మా పిన్నత్తగారింటికి వెళ్ళి కూర్చుని రా. యిది యింకో అరగంటకు పూర్తయిపోతుంది."

నిశ్చింతంగా మళ్ళీ తన రచనా వ్యాసంగంలోకి జారిపోయి దాంట్లో తన్మయత్వం చెందుతున్న భర్తను చూస్తే మొట్టికాయ వేయాలనిపించింది రత్నమాలకి.

రాత్రి ఒకవేళ మెలకువవచ్చి చూస్తే లైటేసుకుని రాసుకుంటున్న భర్త కనిపించేవాడు.

"అర్ధరాత్రికూడా యేమిటా రాతలు ? ఇంక పడుకోండి, ఆరోగ్యం పాడవుతుంది" అర్థించేది.

"ఇష్, మూడ్ పోతుంది. కథ బాగా వస్తోంది. నువు పడుకో" అనేవాడు సూర్యారావు.

అచ్చయిన సూర్యారావు కథలు చాలా తక్కువ చదివింది రత్నమాల. అసలు కథలుచదివే ఇచ్ఛ లేనేలేదు. ఏ కథలు చదివినా ఒకేమాదిరిగా వున్నట్లనిపిస్తుంది. ఓ పది నిముషాలయినా చదివే ఓపిక లేనందువల్ల తన భర్త గంటలకి గంటలు రాస్తున్నా చదువుతున్నా ఆశ్చర్య పడేది ఆయన ఓపికకి.

ఒక ఆదివారం రోజు సాహితీ మిత్రులు కొందరు సూర్యారావు ఇంటికి వచ్చారు, తాము రాసిన కథల రాత ప్రతులతో. సాయంత్రముదాకా వుండి తమతమ కథలమీద అనేక పత్రికలలో చదివిన కథలమీద, అక్కడ లేని రచయితలమీద ఓ. హెన్రీ, మొపాసోలాంటి రచయితలమీదా మాట్లాడుకుంటూండిపోయారు.

రత్నమాలకి ఆ రోజు అర్థమయింది సూర్యారావు తోటి రచయితల యిళ్ళకు వెళ్ళి ఏం చేస్తాడో. ఒక్క విషయంకూడా బోధపడనందువల్ల వాళ్ళ సంభాషణ ఎంతో విసుగనిపించింది. కాఫీ టిఫీనులు చేసి అందరికీ అందించింది భర్త ఆదేశంమీద.

అంతా వెళ్ళాక 'సినిమాకి వెడదాం రెండో ఆటకి' అన్నది రత్నమాల. 'కథల పోటీకి కథ రాయాలి మంచి ప్లాట్, మూడ్, కాగితాలు వున్నాయి' అన్నాడు సూర్యారావు.

"తలనొప్పిగావుంది; ప్రొద్దుణ్నుంచి మీ అందరి వాగుడు విని.

"రేపెడదాం; ఇవాళ కథ రాసి పోస్ట్ చేయాలి. పోటీకి అందరూ పంపించేరు కథలు. నేనే ఇంకా రాయలేదు క్విక్ మెయిలు సర్వీసులో పడవేస్తే ఎల్లుండికి చేరుతుంది సరిగ్గా. ఎల్లుండే ఆఖరిరోజు,"

"నన్నసలు మీ రెందుకు చేసుకున్నట్లు ! అడిగింది రత్నమాల సూటిగా.

"బావుంది ప్రశ్న!" నవ్వాడు సూర్యారావు రైటింగు టేబిలుముందు కూర్చొని.

"మీకు వంటచేసిపెట్టి ఇల్లుచూసుకునే యంత్రాన్ని చేసుకుంటే బావుండేది."

సూర్యారావుకి తెలుసు రత్నమాల మరో గంట దాకా తన వాగ్ధాటిని ఆపదని.

"చూడు రత్నా, చిలికి చిలికి గాలివాన అవుతుంది చివరకి. మనం సినిమాకి వెళ్ళడం లేదు; గొడవ చేయక రాసుకోనీ" సూర్యారావు కోపంగా అన్నాడు.

రత్నమాలమనసు కోపంతో ఉడికిపోతోంది. తాపీగా కథ రాసుకుంటున్న సూర్యారావు అంటేకాదు- అతనిలోని రచయితఅంటే, అతనిలోని రాయకల శక్తిఅంటే అసూయ పుట్టింది; అసహ్యం కలిగింది. తన భర్తని తననుంచి వేరు చేస్తోం దీ రచనాశక్తి. తను కాదు ఆయనకి భార్య; ఆ రచనలే ఆయన పిల్లలు. ఆ కుర్చీ టేబిల్ ఆయన భార్యలు.

తనమీద ఎంతప్రేమవుంటేమాత్రం ఏం? అందుకో

ఇప్పుడు తను ఒట్టిమనిషి కాదనికూడా తెలుసు ఆయనకి ! అయినా తనంటే నిర్లక్ష్యం.

రత్నమాల యేడుపుని దిగమింగుకుని వంటప్రయత్నం చేయసాగింది, తలనిండా ఆలోచనలతో.

* * *

"ఏదో నెల... పురిటికి తీసుకెళదామని వచ్చాను" అన్నాడు సూర్యారావు మామగారు. ఆఫీసునుండి ఇంటికి రాగానే. వాలుకుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతూ కనపడ్డాడాయన.

"మంచిది" అన్నాడు సూర్యారావు.

"రేపే ప్రయాణం"

"అవును; రేపు మంచిరోజనుకుంటాను"

"కథలు యెలా సాగుతున్నాయ్? మొన్నిమధ్య నీ కథేదో చదివాను దేంట్లోనో"

"ఏపత్రికలో ?"

"పేరు గుర్తులేదోయ్!"

"కథ పేరు ?"

"అదీ గుర్తులేదోయ్! బావుంది, డబ్బేమైనా ముడుతుంటుందా ?"

"పర్వాలేదు" అన్నాడు సూర్యారావు ముక్తసరిగా.

"అమ్మాయికి గొలుసు చేయించావని తెలిస్తే

అప్పుడే అనుకున్నాను నీ జీతం మీకు బొటాబొటీగా సరిపో తుంది. పైసంపాదన లేకపోతే కష్టం ఈరోజుల్లో. ఏదో మంచివ్యాపకం"

ఆరాత్రి రత్నమాలకోసం కథలు, పుస్తకాలు ముట్ట లేదు సూర్యారావు.

"పదిహేను రోజుల కోసారయినా వస్తూంటారుగా నన్ను చూడటానికి?" అడిగింది రత్నమాల.

"తప్పకుండా వస్తాను"

"చేతిలో చెయ్యి వెయ్యండయితే!"

"చెయ్యేందుకులే, వస్తానన్నాగా!"

"నాకు తెలుసు, మీరు రారు."

"వస్తా."

"ఎవరూ లేకపోతే చిత్రగుప్తుడిలాగా వంచిన తల ఎత్తకుండా రాసుకుంటూ గడిపేస్తారు. అసలు నేను మీకు గుర్తురాను."

"ఏమిటి నీ పిచ్చి? నెల కోసారయినా వస్తానుగా!"

"ఓ నాలు గయిదు కథలకు ఐడియా లున్నాయి. మీదగ్గర చెప్తే రాస్తారా?" ఆశగా అడిగింది రత్నమాల.

"ఏమిటీ? మళ్ళీ చెప్పు?"

"వినపడ్డదిగా!" మూతి ముడిచింది రత్నమాల.

"ఏమిటేమిటి? నీకు కథలకి ఐడియా లొచ్చాయా? నీ బుర్రకి ఎవరు చిత్రీపట్టా రబ్బా!"

"నన్నేం హేళన చెయ్యక్కర లేదు మీరు. రచయిత భార్యను కాబట్టి నాకు కథలకు ఐడియాలు రావటంలో తప్పేం లేదు."

"కాని నేను ఒకరికి వచ్చిన ఐడియాలని కథలుగా వ్రాయను. ఎలా మరి ? నువ్వే రాయకూడదా ?"

"నాకే అంత ఓపికుంటే మిమ్మల్నెందుకు అడుగుతాను? వ్రాసి మీ పేరుమీదే పంపండి. వచ్చేవారితో షికం మాత్రం పూర్తిగా నాకు యివ్వాలి."

"నీ పేరు మీద పంపితే ఏం ?"

"నిజంగా నేనే వ్రాసినా ఎవరూ నమ్మరు. మీరు. వ్రాసి నాపేరుమీద పంపారనుకుంటారు అంతా. నాకూ యిష్టం వుండదు."

'సరే కానీ'

ఆ రాత్రి రత్నమాల నాలుగయిదు కథలకు ప్లాట్లని చెప్పింది సూర్యారావుకు. సూర్యారావు నిజంగా మెచ్చకున్నాడు భార్యని. రత్నమాలకి వచ్చిన ఆలోచనలకి ఆశ్చర్యపడ్డాడు.

"చాలా మంచి కథలు వ్రాయచ్చు, తప్పకుండా వ్రాస్తాను. వచ్చిన డబ్బు నీకే యిస్తాను" అన్నాడు.

"కాని నా పేరుమీద మాత్రం పంపడానికి వెంత మాత్రం వీల్లేదు."

"ఆల్ రైట్. నా పేరుమీదే పంపుతాను ఆ కథల క్రింద నీకు కృతజ్ఞతలు తెల్పుకుంటాను, సరేనా ?"

ఊహుఁ నా కలాంటివేం యిష్టం లేదని చెప్పానా!"

'సరే, నీ యిష్టం.'

మర్నాడు తండ్రితో వెళ్ళిపోయింది రత్నమాల. పది రోజుల్లో సూర్యారావు రత్నమాల చెప్పిన థీమ్స్‌తో ఆ అయిదు కథలని వ్రాసి అయిదు పెద్ద పత్రికలకి పంపించాడు.

రెండు నెలలలో అయిదు పత్రికల నుంచీ ఆ కథలు వేస్తున్నామని అంగీకారం వచ్చింది.

రత్నమాలకి ఆ సంగతి చెప్పాడు పురుడు కాగానే చూడటానికి శేపల్లె వెళ్ళినప్పుడు.

"మీ కొడుకు మహా మీ అదంతా''అంది రత్నమాల.

"అవును'' అన్నాడు సూర్యారావు నిద్రపోతున్న కొడుకుని ముద్దు పెట్టుకుని.

"తప్పు. నిద్రపోతుంటే ముద్దు పెట్టుకోకూడదు'' మందలించింది రత్నమాల భర్తని.

"వచ్చేనెల యీపాటికి వచ్చేస్తావుగా!'' అడిగాడు సూర్యారావు.

"ఎందుకు నేను రావటం! మీ మీద పోట్లాడటానికా! అడిగింది నవ్వుతూ.

"బోరుగా వుంది నువ్వు లేకపోతే.''

"తిట్టేందుకు ఎవరూ లేరా ?"

"హోటల్ తిండి పడటం లేదు."

"కథలకి కొత్త థీమ్స్ చెప్తానన్నా!"

"చెప్తావా!"

"తప్పకుండా. కొన్ని ఆలోచించి పెట్టుకున్నాను."

"వెరీ గుడ్"

పదిహేను రోజుల తేడాతో ఆ అయిదు కథలూ ఒకే సారిగా ప్రచురింపబడ్డాయి వివిధ పత్రికలలో. రెండో కథ చదివిన ఓ మిత్రుడు మెచ్చుకుని అన్నాడు—

"తెలుగులో ఇలాంటి కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా బావుంది."

మరో పదిహేను రోజులు గడిచాయి.

ఒక్కొక్క పత్రికనుంచే వుత్తరాలు వచ్చాయి. ఆ అయిదు గ్రేనేడ్‌లలా పేలాయి సూర్యారావు గుండెల్లో.

ఆ అయిదు కథలూ అంత క్రితం ప్రచురింపబడ్డాయని, అందులో ఓ రెండు కథలనీ, ఆ కథలు తెలుగులోకి అనువదింపబడి, సంపుటిగా తెలుగులోనే ప్రచురింప బడ్డాయనీ, పేరు ప్రఖ్యాతులుగల సూర్యారావులాంటి రచయిత కథలని కాపీ కొట్టడం మిక్కిలి శోచనీయమయిన సంగతనీ, పత్రికా ముఖంగా పాఠకులని సంజాయిషీ వ్రాసి పంపమనీ, అనేక మంది పాఠకులు ఆ కథలకి కాపీ కథలుగా పేర్కొంటూ వుత్తరాలు వ్రాశారనీ పత్రికా సంపాదకులు వ్రాసిన వుత్తరా

లవి. యిద్దరు సంపాదకులు ఆ కథలకి రెమ్యూనిరేషన్ యివ్వమని వ్రాశారు. ముగ్గురు సంపాదకులు పరిశీలనలో వున్న కథలన్నిటినీ తిప్పి పంపేస్తున్నామని వ్రాశారు.

ఏం చేయాలో తోచలేదు. రచయితగా తన కేరీర్ పూర్తిగా దెబ్బతినే పరిస్థితిలో వుందని గుర్తించాడు. జవాబు వ్రాద్దామనుకుంటే కలం కదలలేదు.

రత్నమాలని అడిగాడు కోపంగా.

"నిజంగా నువ్వు చెప్పిన కథలకి ఐడియా నీకే వచ్చిందా ? ఎవరయినా చెప్పారా ? ఎక్కడయినా చదివావా ?"

"నిజం. నేనే వూహించి చెప్పాను."

"అబద్ధం. నువు ఎక్కడో చదివి చెప్పావవి. అవునా? చూడు నీవల్ల ఏం జరిగిందో ?" సంపాదకుల వుత్తరాలు భార్య మొహంమీదకి గిరాటేశాడు. విసురుగా బయటికి నడిచాడు

రాత్రి పదకొండున్నరకి ఇంటికి తిరిగి వచ్చాడు, సినిమా ఒకటి చూసి.

"పోన్లే ఏడవకు" అన్నాడు ఏడుస్తూన్న రత్నమాలని చూసి జాలిపడి. ఏడ్చియేడ్చి కళ్ళు వుబ్బిపోయాయి రత్నమాలకి.

నాలుగు రోజుల తరువాత ఆ అయిదు కథలు ప్రచురించిన పత్రికా సంపాదకుల్లో ఓ సంపాదకుడినుంచి వుత్తరం

వచ్చింది సూర్యారావుకి. ఆసమయంలో అతను ఆఫీసులో వున్నాడు. రత్నమాల అలవాటుగా ఆకవరుచించి చదివింది.

తమ పత్రికలో ప్రచురింపబడ్డకథ కాపీకథగా వ్రాసిన పాఠకుల వుత్తరాలు కొన్ని జతపరుస్తున్నామనీ, తిరుగు టపాలో వాటికి జవాబు వ్రాసి పంపితే పత్రికలో ప్రచురిస్తా మనీ మేటర్ ప్రెస్‌కి వెళ్ళబోతోందికాబట్టి వెంటనే జవాబు వ్రాయమనీ సారాంశం.

ఆ వుత్తరాలలో ఒకటి తనచేతి వ్రాతతో వుండటం గమనించగానే రత్నమాలగుండె ఆగినంత పనయింది. ఆవుత్తరం తను రేపల్లెనుంచి ఆ పత్రికకి వ్రాసింది తన భర్త కథ పడగానే ఆకథ కాపీ కథ అనీ, మూలం ఫలానా కథ అనీ.

"ఇంకా నయం, ఈవుత్తరం ఆయన చేతిలో పడితే?" అనుకుంది తన వుత్తరం చింపేసింది వెంటనే.

* * *

ఆరు నెలల తర్వాత సూర్యారావు రైటింగు టేబిలు ముందు కూర్చుని ఇదివరలా కథలూ అవీ వ్రాయటం లేదు. ఆఫీసునుంచి ఇంటికి సాయంత్రం తిరిగిరాగానే తనకొడుకుతో ఆడుకోవడం వ్యసనంగా మారింది ఇప్పుడు పాత వ్యసనం స్థానంలో ఈ కొత్త అలవాటు చోటు చేసుకుంది.

ఒకరోజు ఇన్‌లాండులెటర్‌లో ఇలా వ్రాసి పడేసింది రత్నమాల తన అన్నయ్యకి—

"అన్నయ్యా,

నువ్వు చెప్పిన పాచిక పారింది. నువు చెప్పిన అయిదు కథలు ఆయనచేత వ్రాయించి, అవి ప్రచురింపబడ్డాక ఆ కథలు కాపీకథలని వ్రాశాను ఆ పత్రికా సంపాదకులకి. ఆయనకి ఇప్పుడు పత్రికలన్నా కథలన్నా ఇడ్వరలా ఏమాత్రం వుత్సాహం లేదు. మన లోకంలో పడ్డారు. మనియార్డర్లూ, చెక్కులూ రాకపోయినా నాతో బాబుతో నవ్వుతూ తిర్గుతున్నారు. అది అన్నిటిపెట్టు.

నీ చెల్లెలు

—రత్నమాల"

—×—